విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

- ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్రలో ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు

ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్రలో సైకిల్ తొక్కుతున్న ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఫిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 'విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర'ను రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలని, మిడ్డేమీల్స్ నిర్వహించాలని, హాస్టల్స్‌కు సొంత భవనాలు కేటాయించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, కందుకూరి విద్యాసంస్థలకు నాడు-నేడు నిధులు కేటాయించాలని నినదించారు. కోటిపల్లి బస్టాండ్ నుంచి ట్రైనింగ్ కళాశాల, ఎస్‌కెవిటి పాఠశాలల్లో ఈ సందర్భంగా సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. శాస్త్రీయ విద్య కోసం విద్యార్థులు పోరాడాలని కోరారు. వ్యక్తిగత వాదాన్ని పక్కన పెట్టి సమాజ బాధ్యత, శ్రేయస్సు కోసం పాటు పడాలన్నారు. ట్రైనింగ్ కళాశాలకు ఎంతో చారిత్రక వైభవం ఉందని, ప్రభుత్వ విధానాలు, సిబ్బంది కొరత కారణంగా ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 150కి పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కందుకూరి సంస్థలకు సంబంధించిన కమర్షియల్ భవనాలను కందుకూరి విద్యాసంస్థలకు అటాచ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. పేదలకు విద్యను దూరం చేసే విధానాలను విడనాడాలని, లేకుంటే విద్యార్థులతో కలిసి ఐక్యంగా పోరాడుతామని హెచ్చరించారు. అంతకుముందు కోటిపల్లి బస్టాండ్ నుంచి ట్రైనింగ్ కాలేజీ వరకూ వెంకటేశ్వరరావు సైకిల్ తొక్కారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాంబాబు, ఎన్.రాజా, జిల్లా మాజీ కార్యదర్శి బి.పవన్, జిల్లా సహాయక కార్యదర్శి వై.భాస్కర్, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

గల్లంతైన ముగ్గురి మృతదేహాలు లభ్యం

ప్రజాశక్తి-నిజాంపట్నం (బాపట్ల జిల్లా)

నిజాంపట్నం హార్బర్ సమీపంలో మొగ వద్ద ఆదివారం జరిగిన ఫైబర్ బోటు బోల్తా ప్రమాదంలో గల్లంతైన తల్లి, ఇద్దరు బిడ్డలు మృతిచెందారు. మెరైన్ పోలీసులు, స్థానిక పోలీసులతో పాటు గజ ఈతగాళ్లు గాలింపు చర్యలను ముమ్మరం చేసి.. సాయి వర్ధిక (25), తన్విష్ కుమార్ (7), తరుణ్ ఈశ్వర్ (11 నెలలు) మృతదేహాలను సోమవారం వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు నిజాంపట్నం ఎస్ఐ రమేష్ తెలిపారు. బాధిత కుటుంబాన్ని ఎంపి మోపిదేవి వెంకటరమణారావు పరామర్శించి, రూ.50 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

మరో అధికారిపై వేటు

- అనంతపురం పూర్వ జడ్పి సిఇఒ శోభా స్వరూపరాణి సస్పెన్షన్

ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి

నిబంధనలకు విరుద్ధంగా ఓటర్లను తొలగించారన్న ఆరోపణలపై అనంతపురం జిల్లాకు చెందిన మరో అధికారిపై వేటు పడింది. జిల్లా పరిషత్ పూర్వపు సిఇఒ శోభా స్వరూపరాణిని సస్పెండ్ చేస్తూ ఈనెల 19న పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె ఉరవకొండ అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల అధికారిగా ఉన్న సమయంలో నిబంధనలకు విరుద్ధంగా 1796 ఓటర్లను తొలగించారన్న ఆరోపణలున్నాయి. ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఎన్నికల సంఘం విచారణ చేపట్టి కొంత మందిపై చర్యలకు ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే అనంతపురం జడ్పి సిఇఒ కె.భాస్కర్‌రెడ్డి, ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇద్దరు బిఎల్ఒలు సస్పెండ్ అయ్యారు.

తెలంగాణ ప్రగతిపై విషం చిమ్ముతున్న పత్రికల జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలివ్వం : కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు అంశం చివరి దశలో ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ తెలిపారు. రాష్ట్ర ప్రగతిపై విషం చిమ్మే పత్రికల్లో పనిచేసే విలేకరులకు ఇళ్ల స్థలాలివ్వబోమని, న్యూట్రల్‌గా ఉన్న జర్నలిస్టులందరికీ ఇవ్వాలని నిర్ణయించామన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కెసిఆర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రగతిపై ఆర్‌బిఐ, నీతిఆయోగ్, కేంద్ర మంత్రులు ప్రశంసలు కురిపిస్తున్నా కొన్ని పత్రికలు పనికట్టుకుని వ్యతిరేక వార్తలు రాస్తున్నాయని, ఆ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఎందుకివ్వాలని, పాలుపోసి పామును పెంచలేము కదా అని కెసిఆర్ ప్రశ్నించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-పెద్దదోర్నాల (ప్రకాశం జిల్లా)

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండలం రామచంద్రకోటలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు కథనం ప్రకారం... గ్రామానికి చెందిన రైతు మాలపాటి భాస్కరరెడ్డి (46)కి 5.60 ఎకరాల సాగు భూమి ఉంది. అందులో వ్యవసాయ బోర్లు ఏర్పాటు చేసుకుని, మిరప, పత్తి సాగు చేసేవారు. ఆశించిన మేర దిగుబడులు రాలేదు. రూ.15 లక్షల వరకు అప్పు చేరుకుంది. ఈ ఏడాదైనా కలిసి వస్తుందనే ఆశతో మిరప నాటేందుకు పొలాన్ని సిద్ధం చేశారు. అప్పు తీర్చలేకపోవడంతో తిరిగి పెట్టుబడులకు ఎవ్వరూ రుణం ఇవ్వలేదు. దీంతో భాస్కరరెడ్డి సోమవారం ఉదయం తన పొలంలో పురుగు మందు తాగారు. గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు.

దొంగ ఓట్ల నమోదు వికృత చేష్టే : పురందేశ్వరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజాస్వామ్యంలో అధికార పార్టీ దొంగ ఓట్లను నమోదు చేయించడం అదో రకమైన వికృత చేష్ట అని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. విజయవాడలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఓటరు అవగాహనపై పార్టీ శ్రేణులకు రాష్ట్ర స్థాయి శిక్షణ శిబిరం నిర్వహించారు. బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో రాష్ట్ర ప్రభుత్వాలు అప్పులు, అవినీతి, అరాచకాల్లో పోటీపడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి సునీల్ దేవదర్, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు పాల్గొన్నారు.

జాబిల్లికి ఆవలవైపు...

- చిత్రాలు విడుదల చేసిన ఇస్రో
- చంద్రయాన-2 ఆర్బిటర్‌తో చంద్రయాన-3 ల్యాండర్‌కు కమ్యూనికేషన్

బెంగళూరు : చంద్రుని ఉపరితలానికి ఆవలవైపు తీసిన చిత్రాలను ఇస్రో సోమవారం విడుదల చేసింది. చంద్రుడికి ఆవల వైపు భాగం ఎప్పుడూ భూమికి కనిపించదు, అందువల్ల దీన్ని చీకటి ప్రాంతంగా పేర్కొంటారు. ఇప్పుడు ఈ చీకటి ప్రాంతం వివరాలు తెలుసుకునేందుకే ఈ చంద్రయాన-3ని పంపించారు. ల్యాండర్‌లోని ఎల్‌హెచ్‌డిఎసి (ల్యాండర్ హజార్డ్ డిటెక్షన్ అండ్ అవాయిడెన్స్ కెమెరా) ఈ నెల 19న ఈ చిత్రాలను తీసింది. "పెద్ద పెద్ద బండరాళ్లు లేదా లోతైన గోతులు లేకుండా చంద్రయాన్ సురక్షితంగా ల్యాండ్ అయ్యే ప్రాంతాన్ని గుర్తించడంలో ఈ కెమెరా సాయపడుతుంది." అని ఇస్రో సామాజిక వేదిక ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ఆదివారం చంద్రుని ఉపరితలంపై కుప్పకూలిన రష్యా లూనార్ మిషన్ లూనా-25 కూడా చంద్రుని ఆవల వైపు భాగానికి సంబంధించిన చిత్రాలను పంపింది. ఈ నెల 5, 15, 17 తేదీల్లో చంద్రయాన-3 పంపిన మూడు వీడియోలను ఇస్రో ఇప్పటికే విడుదల చేసింది.

స్వాగతం మిత్రమా !

చంద్రయాన-2 ఆర్బిటర్, చంద్రయాన-3 లూనార్ మాడ్యూల్ మధ్య పరస్పర కమ్యూనికేషన్ ఏర్పడిందని ఇస్రో సోమవారం ప్రకటించింది. "వెల్‌కమ్ బడ్డీ !" (స్వాగతం మిత్రమా !) అంటూ చంద్రయాన-2 ఆర్బిటర్, చంద్రయాన-3 ల్యాండర్ మాడ్యూల్‌ను పలకరించి, స్వాగతం చెప్పింది. ల్యాండర్ మాడ్యూల్‌ను చేరడానికి ఇప్పుడు మిషన్ ఆపరేషన్స్ కాంప్లెక్స్ (ఎంఒఎస్)కు అనేక మార్గాలు వున్నాయని ఇస్రో పేర్కొంది.

బుధవారం సాయంత్రం 6.04 గంటలకు చంద్రుని ఉపరితలంపై ల్యాండర్ దిగుతుందని భావిస్తున్నట్లు ఇస్రో ప్రకటించిన సంగతి తెలిసిందే. బెంగళూరులోని ఇస్రో టెలిమెట్రీ, ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్‌లో మాక్స్ విభాగం వుంది. 5.20 గంటల నుంచి ల్యాండింగ్ ప్రక్రియ ప్రత్యక్ష ప్రసారం ప్రారంభమవుతుందని ఇస్రో తెలిపింది.

బిజెపి ఎంపి, హీరో సన్నీ డియోల్ అప్పు ఎగనామం

- బ్యాంక్ ఆఫ్ బరోడా నోటీసులు అనూహ్యంగా ఉపసంహరణ

న్యూఢిల్లీ : బిజెపి ఎంపి, ప్రముఖ బాలీవుడ్ నటుడు సన్నీడియోల్ బ్యాంక్‌ల నుంచి అప్పులు తీసుకుని ఎగనామం పెట్టారు. మధ్యప్రదేశ్ నుంచి ఎంపిగా ఎన్నికయిన సన్నీడియోల్ 2016లో ఒక సినిమా కోసం బ్యాంక్ ఆఫ్ బరోడా (బిఒబి) నుంచి అప్పు తీసుకున్నారు. బకాయి రూ.56 కోట్లకు చేరడంతో, గతేడాది మొండి బకాయిల జాబితాలో చేర్చారు. ముంబయిలో సన్నీకి చెందిన ఓ విల్లాను సెప్టెంబర్ 25న ఇ-వేలం వేస్తామని, ఇందులో పాల్గొనే వారు సెప్టెంబర్ 22లోపు దరఖాస్తు చేసుకోవచ్చని బ్యాంక్ వర్గాలు తెలిపాయి. సన్నీ డియోల్‌కు అప్పు తీసుకునేటప్పుడు సన్నీ సౌండ్స్ డియోల్స్ యాజమాన్యంలోని సంస్థ సహా, సన్నీ డియోల్ తండ్రి, బాలీవుడ్ హీరో నటుడు, బిజెపి మాజీ ఎంపి. తండ్రి ధర్మేంద్ర వ్యక్తిగత హామీ ఇచ్చారు. ధర్మేంద్ర భార్య, నటి హేమామాలిని కూడా బిజెపి ఎంపి కావడం విశేషం. బిఒబి అనూహ్యంగా సన్నీ డియోల్‌కు ఇచ్చిన నోటీసును ఉపసంహరించుకున్నట్లు ప్రకటించింది. సాంకేతిక కారణాల వల్ల ఇ-వేలంను రద్దు చేశామని బిఒబి వెల్లడించింది. ఈ పరిణామంపై కాంగ్రెస్ పార్టీ నేత జైరాం రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఓట్లు తొలగింపుతో ప్రజాతీర్పు అపహాస్యం : బోండా ఉమా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇష్టానుసారం ఓట్లు తొలగించడమంటే ప్రజల తీర్పును అపహాస్యం చేయడమేనని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు బోండా ఉమామహేశ్వరరావు అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో దొంగ ఓట్లతో గెలవాలని వైసిపి కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వలంటీర్ల ద్వారా సేకరించిన సమాచారంతో పెద్దయెత్తున నకిలీ ఓటర్లను సృష్టిస్తోందని ఆరోపించారు. ఉరవకొండ నియోజకవర్గంలో ప్రభుత్వ అండతో అధికారులు ఆరువేల ఓట్లు తొలగించారని అన్నారు. ఈ తప్పిదాలకు బాధ్యుల్ని చేస్తూ ఒక తహశీల్దారును, ఐదుగురు బిఎల్ఒలను ప్రభుత్వం సస్పెండ్ చేసిందని తెలిపారు. అనంతపురం జెడ్‌పి సిఇఒనూ సస్పెండ్ చేసిందని వివరించారు. టిడిపి కార్యకర్తలు, సానుభూతిపరుల ఓట్లు తొలగించడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా 400 మందితో ఒక వ్యవస్థను ఏర్పాటు చేసిందని అన్నారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించిందని విమర్శించారు. ఈ త్వరలోనే ఈ వ్యవహారంపై మాట్లాడేందుకు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఢిల్లీ వెళ్లనున్నారని తెలిపారు.

'దళితులు రాకుండా ఆలయానికి తాళం వేసిన... శ్రీనివాస్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలి'

ప్రజాశక్తి - పుత్తూరు , యంత్రాంగం (తిరుపతి జిల్లా)

దళితులు రావడానికి వీల్లేదంటూ ఆలయానికి తాళం వేసిన శ్రీనివాస్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని, ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేయాలని అఖిలపక్షం నేతలు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిఎం దృష్టికి ఈ వివక్షను తీసుకెళ్లి, చలో పోలాక్షమ్మ ఆలయం చేపడతామన్నారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేష్, దళిత హక్కుల పోరాట సమితి డిహెచ్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు డి మహేష్ ఆధ్వర్యంలో అంబేద్కర్ భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో మంగళవారం ఎస్‌పి, కలెక్టర్లను కలిసి వినతిపత్రాలు ఇవ్వాలని, గురువారం నిరసన దీక్ష చేపట్టాలని, 28న ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తాయని కార్యాచరణ రూపొందించారు. స్పందించకుంటే సెప్టెంబర్ 3వ తేదీ 'చలో రామకృష్ణాపురం పోలాక్షమ్మ గుడి' చేపడతామని నేతలు హెచ్చరించారు.

చీరాల డిపోలో ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు , బస్సు డ్రైవర్లు

డ్రైవర్‌పై ప్యాసింజర్ దాడి

- 40 బస్సులు నిలిపివేసి నిరసన

ప్రపజాశక్తి-చీరాల (బాపట్ల జిల్లా)

తాను ఆపమన్నప్పుడు వెంటనే బస్సు ఆపలేదని.. హైర్ బస్సు డ్రైవర్‌పై ఓ ప్యాసింజర్ ఆదివారం దాడి చేశాడు. దీంతో డ్రైవర్‌కు మద్దతుగా హైర్ బస్సు డ్రైవర్లు సిఐటియు ఆధ్వర్యంలో 40 సర్వీసులను నిలిపేసి.. సోమవారం నిరసన తెలిపారు. బాధితుడి కథనం ప్రకారం.. ఆదివారం ఉదయం విజయవాడ నుండి చీరాల డిపో హైర్ బస్సును ప్యాసింజర్లతో డ్రైవర్ శివయ్య బయలుదేరాడు. చీరాల వెళ్లేందుకు విజయవాడ గౌతమి విద్యాసంస్థలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న ఈపురుపాలెంకు చెందిన ఊట్ల శ్రీనివాసరావు విజయవాడలో బస్సును ఆపాడు. ఇతర వాహనాలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు కొంతదూరం వెళ్లిన తర్వాత డ్రైవర్ బస్సును ఆపాడు. తాను ఆపమన్న చోట ఆపలేదని కోపోద్రిక్తుడైన శ్రీనివాసరావు బస్సు డ్రైవర్‌తో వాదనకు దిగాడు. 'నేనెవరో తెలుసా? నా భార్య గుంటూరు జిల్లాలో ఆర్‌టిసి డిపిటిఒ అధికారి.. నా గురించి నీకు పూర్తిగా తెలియదు' అంటూ తోటి ప్రయాణికుల ముందే కండక్టర్‌తో పాటు డ్రైవర్ శివయ్యను దుర్భాషలాడాడు. శివయ్యపై దాడి చేసి గాయపరిచాడు. గాయపడిన శివయ్యను చీరాల ఏరియా వైద్యశాలలో చేరారు. అనంతరం అవుట్‌పోస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ సిబ్బందిపై ప్రయాణికులు దాడి చేయడాన్ని ఖండిస్తూ విజయవాడ, ఒంగోలు, నరసరావుపేట పరిధిలో సుమారు 40 హైర్ బస్సు సర్వీసులను సోమవారం నిలిపివేశారు. బాపట్ల ఆర్ఎం, చీరాల డిఎం శ్యామలతో సిఐటియు నాయకులు బాబూరావు, ఎం.వసంతరావు చర్చలు జరిపారు. శ్రీనివాసరావుపై కేసు నమోదుకు సహకరిస్తామని ఆర్‌టిసి అధికారులు హామీ ఇచ్చారు. చికిత్స పొందుతున్న డ్రైవర్ శివయ్యను సిఐటియు నాయకులు, హయ్యర్ బస్సు సిబ్బంది పరామర్శించారు.

బ్యాంకింగ్ మోసాల్లో 'ఉన్నతాధికారుల'పై చర్యలు ప్రత్యేక అడ్వైజరీ బోర్డు ఏర్పాటు

న్యూఢిల్లీ : ప్రభుత్వ బ్యాంకింగ్, విత్త రంగంలో ఆర్థిక మోసాల్లో ఉన్నతాధికారుల పాత్రపై విచారణ చేయడానికి కేంద్రం కొత్త బోర్డ్‌ను ఏర్పాటు చేసింది. మాజీ సెంట్రల్ విజిలెన్స్ కమీషనర్ (సివిసి) సురేష్ ఎన్ పటేల్ ఛైర్మన్‌గా బ్యాంక్ మోసాలపై అడ్వైజరీ బోర్డ్‌ను నియమించింది. ది అడ్వైజరీ బోర్డ్ ఫర్ బ్యాంకింగ్, ఫైనాన్సియల్ ఫ్రాడ్స్ (ఎబిబిఎఫ్ఎఫ్)లో సభ్యులుగా మాజీ సైనికుల సంక్షేమ శాఖ మాజీ కార్యదర్శి రవి కాంత్, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ మాజీ డైరెక్టర్ జనరల్ రజనీ కాంత్ మిశ్రా, ఎగ్జిమ్ బ్యాంక్ మాజీ ఎండి డేవిడ్ రాస్కిన్హా, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ మాజీ ఎండి, సిఇఒ పార్థ ప్రతీమ్ సేన్‌గుప్తా ఉన్నారు. ఛైర్మన్, సభ్యుల పదవీ కాలం 2023 ఆగస్టు 21 నుండి రెండేళ్ల పాటు ఉంటుందని సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ జారీ చేసిన ఉత్తర్వుల్లో వెల్లడించింది. ఎబిబిఎఫ్ఎఫ్ ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రభుత్వ రంగ బీమా కంపెనీలు, ప్రభుత్వ రంగంలోని అన్ని స్థాయిల అధికారుల పాత్రను పరిశీలిస్తుంది. రూ.3 కోట్లకు పైబడిన మోసాలకు సంబంధించిన అన్ని విషయాలను బోర్డుకు సూచిస్తాయి.

ప్లేస్టోర్ నుంచి 43 యాప్స్ తొలగింపు

న్యూఢిల్లీ : 43 యాప్‌సను తొలగిస్తున్నట్లు గూగుల్ ప్లే స్టోర్ వెల్లడించింది. సదరు యాప్స్ ఫోన్ బ్యాటరీ లైఫ్‌ను తినేయడంతోపాటు యూజర్ల డేటాను తస్కరిస్తున్నాయని, గూగుల్ ప్లే స్టోర్ పాలసీలను ఉల్లంఘిస్తున్నాయని మొబైల్ రీసెర్చ్ టీం మైకేఫే పేర్కొంది. టివి, డిఎంబి ప్లేయర్స్, మ్యూజిక్ డెవలపర్స్, బారో టీవీ, జిహోస్టాప్ మొబైల్ రికవరీ యాప్, మ్యూజిక్ బడా, మ్యూజిక్ డౌన్‌లోడర్, బారో డిజిటల్ గిఫ్టింగ్ యాప్, న్యూ లైవ్, రింగ్‌టోన్స్ ఫ్రీ మ్యూజిక్, స్ట్రీమ్‌కార్ లైవ్ స్ట్రీమింగ్, లైవ్‌ప్లే తదితర యాప్స్ తొలగించిన వాటిలో ఉన్నాయి.

భారీ విస్తరణపై బిగ్ సి దృష్టి

- వచ్చే రెండేళ్లలో రూ.300 కోట్ల పెట్టుబడులు

హైదరాబాద్ : ప్రముఖ మొబైల్ రిటైల్ చెయిన్ బిగ్ సి భారీ విస్తరణపై దృష్టి పెట్టింది. వచ్చే రెండేళ్లలో కొత్తగా 150 స్టోర్‌లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం రూ.300 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం ఈ సంస్థకు తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడులో 250 స్టోర్లున్నాయి. ఆర్థిక సంవత్సరం 2023-24లో 50 శాతం వృద్ధితో రూ.1,500 కోట్ల టర్నోవర్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని బిగ్ సి ఫౌండర్, సిఎండి బాలు చౌదరి తెలిపారు. కంపెనీ రెండు దశాబ్దాల వేడుకల్లో భాగంగా బిగ్-సి బ్రాండ్ అంబాసిడర్, సినీ నటుడు మహేశ్ బాబుతో కలిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వై స్వప్న కుమార్, డైరెక్టర్లు జి.బాలాజీ రెడ్డి, ఆర్.గౌతమ్ రెడ్డి, కైలాశ్ లఖ్యానితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. 2002 డిసెంబర్ 23న బిగ్‌సి ప్రయాణం ప్రారంభమయ్యిందన్నారు. ఇప్పటి వరకు తొలి స్థానంలో నిలిచామని.. మూడవ దశాబ్దంలోనూ అగ్ర స్థానాన్ని కొనసాగిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 3 కోట్ల మంది వినియోగదారులను చేరకున్నా మన్నారు.

బోణీకొట్టిన బెజవాడ టైగర్స్

ప్రజాశక్తి - పిఎం.పాలెం (విశాఖపట్నం)

వరుసగా మూడు మ్యాచ్‌ల్లో పరాజయం పాలైన బెజవాడ టైగర్స్ జట్టు ఎట్టకేలకు బోణీకొట్టింది. విశాఖలోని ఎసిఎ - విడిసిఎ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఎపిఎల్) సీజన్ 2లో భాగంగా సోమవారం జరిగిన మ్యాచ్‌లో ఉత్తరాంధ్ర లయన్స్ జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలుచుకున్న ఉత్తరాంధ్ర లయన్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుని బరిలోకి దిగినా, ఓపెనర్లు అంతగా రాణించలేదు. మిడిల్ ఆర్డర్ ఆటగాళ్లు జి శ్యామ్ సుందర్, ఎస్‌వి రాహుల్ చక్కని ఆటతీరుతో 77 బంతుల్లో 86 పరుగులతో మంచి పార్టనర్‌షిప్ నెలకొల్పారు. మొత్తానికి 20 ఓవర్లలో 4 వికెట్లను కోల్పోయి 159 పరుగులు సాధించింది. బెజవాడ టైగర్స్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఉత్తరాంధ్ర లయన్స్ జట్టు స్పీడ్‌కు బ్రేకులు పడ్డాయి. బ్యాటింగ్‌కు దిగిన బెజవాడ టైగర్స్ 160 పరుగుల టార్గెట్‌ను 18.4 ఓవర్లలో 3 వికెట్లు నష్టంతో గెలుపు అందుకున్నారు. ఓపెనర్ బ్యాట్స్‌మ్యాన్ కె మహీప్ కుమార్ 51 బంతుల్లో 4 సిక్స్‌లు, 6 ఫోర్లుతో 77 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
సంప్రదించాల్సిన చిరునామా: 11వ అంతస్తు, టవర్ ఎ, పెనిన్సుల బిజినెస్ పార్క్స్, గన్‌పత్రావ్ కదం మార్గ్, లోయర్ పారెల్, ముంబయి-400013, సంప్రదించాల్సిన నం.(022) 61827414, (022) 61827375.
స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)
(ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యొక్క రూల్ 8(1) ప్రకారం)
ఏదైతే, క్రింది సంతకందారు టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, సదరు నోటీసు తేది నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలను చెల్లించవలసిందిగా రుణగ్రహీతలను కోరుతూ సదరు తేదీన డిమాండ్ నోటీసును జారీచేశారు. రుణగ్రహీత మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సర్వజనులకు ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు సదరు రూల్స్ యొక్క రూలు 8తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని ఇందు దిగువ వివరించిన ఆస్తిని స్వాధీనంచేసుకున్నారు.
ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లా వాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, డిమాండ్ నోటీసు తేది నుండి దిగువ పేర్కొన్న మొత్తాలను దానిపై వడ్డీ& పెనల్ వడ్డీ, చార్జీలు, ఖర్చులు మొ॥వాటితోపాటు టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ కు చెల్లింపులచేయు నిమిత్తం ఉంటుంది.
సెక్యూర్డ్ అసెట్స్ ను విడిపించు కొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాల పై రుణగ్రహీతలు శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.

రుణ ఖాతా నం.	బాధ్యులు/చట్టబద్ధ వారసులు/చట్టబద్ధ ప్రతినిధుల పేరు	డిమాండ్ నోటీసు తేది & మొత్తాలు	సెక్షన్ 13(4) క్రింద స్వాధీనతా తేది
TCHHF0803000100086845, TCHHF0803000100086855&TCHHL0803000100086893	శ్రీ కోట కిరణ్ కుమార్ (రుణగ్రహీత) శ్రీమతి కె. వనీత (సహ-రుణగ్రహీత)	17.04.2023 నాటికి రూ.60,43,066/- (రూపాయలు అరవై లక్షల నలుభై మూడు వేల అరవై ఆరు మాత్రమే)	17 ఆగస్టు, 2023

స్థిరాస్తి షెడ్యూలు-1: రిజిష్టర్డు సేల్ డీడ్ నం.14683/2006 ఆధారంగా శ్రీ కోట కిరణ్ కుమార్ పేరున, కృష్ణా జిల్లా, విజయవాడ, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, భవానిపురం, ఊర్మిల సుబ్బారావు నగర్ వద్దగల ఆర్.ఎస్.నం.7(పి), 8,9(పి), 17(పి), ప్లాట్ నం.424, ప్రస్తుత మున్సిపల్ వార్డు నం.31ఎ, పాత అసెస్మెంట్ నం.31047ఎ/424, కొత్త అసెస్మెంట్ నం. 83432, డోర్ నం.76-17-424 లో దానిపై నిర్మించిన ఆర్‌సిసి రూఫ్ నిర్మాణము యొక్క 72.0చ.గ.ల లేదా 60.20చ.మీ.ల విస్తీర్ణపు భాగం మొత్తం మరియు సరిహద్దుల